క్లుప్తంగా

పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐగా లింగన్న


ఎస్పీ రత్నను కలిసిన ఎస్‌ఐ లింగన్న

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి రూరల్ స్టేషన్‌లో ఎస్‌ఐగా లింగన్న గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ కృష్ణ మూర్తి బుక్కపట్నంకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ లింగన్న డీపీఓ కార్యాలయంలో ఎస్పీ రత్నకు మొక్కను అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానన్నారు.

ఎస్‌ఐని కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు


ఎస్‌ఐ మక్బూల్ బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నల్లచెరువు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన మక్బూల్‌బాషాను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దశరథనాయుడు, నాయకులు ఉత్తన్న, ఎంఆర్ అంజనప్ప, బాబూరెడ్డి, ఎల్లారెడ్డి, కల్లిపల్లి శ్రీనివాసులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎస్‌ఐకు పూల మాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.

అండర్-19 జిల్లా జట్టుకు ఎనుములపల్లి విద్యార్థి


సాయి చంద్ర

పుట్టపర్తి అర్బన్: విశాఖపట్నంలో జరుగనున్న బాల్ బ్యాడ్మింటన్ అండర్-19 ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు ఎనుములపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి సాయి చంద్ర ఎంపికైనట్లు హెచ్‌ఎం సుధాకర్ పేర్కొన్నారు. విద్యార్థి ఎంపిక పట్ల పీడీ రమేష్‌బాబు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఓడీచెరువు ఎంపీడీఓగా రాబర్ట్‌విల్సన్



ఓడీచెరువు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా రాబర్ట్‌విల్సన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన రొద్దం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీఓకు స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా పద్మనాభరెడ్డి, ఈఓఆర్డీగా కేశవరెడ్డి, కార్యాలయ ఏఓగా వెంకటరమణ విధుల్లో చేరారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి


ఎమ్మెల్యేకి వినతిపత్రం అందిస్తున్న బీసీ నాయకులు

కదిరి టౌన్: బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతా నాగరాజు ఆధ్వర్యంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టాలన్నారు. బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని, బీసీ భవనాన్ని నిర్మించాల కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నారాయణ, భోజనం శ్రీనివాసులు, రామ్మోహన, గోపాల్, ముని స్వామి, అనిల్, జయరాజ్, శంకర్, నారాయణ, రాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

పుట్టపర్తి టౌన్: పట్టణంలో విద్యుత్ అంతరాయం సమస్యను పరిష్కరించాలని గ్రీన్ భారత్ ఫౌండేషన్ చైర్మన్ శంకరనారాయణ కలెక్టర్ టీఎస్ చేతన్‌ను కోరారు. ఈమేరకు ఆయన ఫౌండేషన్ సభ్యులతో సాయి ఆరామంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి బాబా మహాసమాధి దర్శనార్థం 144 దేశాల నుంచి భక్తులు వస్తుంటారన్నారు. వారికి ఇబ్బంది రాకుండా విద్యుత్ అంతరాయం సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ సమస్యకు సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వినియోగదారులూ.. పారాహుషార్!

ధర్మవరం కేశవనగర్‌కు చెందిన మధుసూదన్ తన బైక్‌కు 5 లీటర్ల పెట్రోల్ వేయించాడు. తన వాహనం మైలేజీ లీటరుకు 50 కి.మీ వస్తుంది. ఈ లెక్కన 250 కి.మీ మైలేజీ రావాలి. కాని 210 కి.మీ మాత్రమే వచ్చింది. దీంతో రెండోసారి పెట్రోలు బంకుకు వెళ్లి 5 లీటర్ల బ్యాంకు పై నుంచి వేయమని బాయ్‌కు చెప్పాడు. మీటర్ తిరుగుతున్నా పంపులో నుంచి పెట్రోల్ రాలేదు. 20 పాయింట్ల తర్వాత పెట్రోల్ వచ్చింది. ఇదేమని ప్రశ్నిస్తే మిషన్ రిపేరీలో ఉందని, కాని 5 లీటర్ల పెట్రోల్ పడుతుందని సమాధానం చెప్పాడు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించాడు మధుసూదన్.

ధర్మవరం శివానగర్‌కు చెందిన మరో వాహనచోదకుడు రాజేంద్రప్రసాద్ పెట్రోల్ వేయించుకున్న అనంతరం టైర్లకు గాలి పెట్టాలని పెట్రోల్ బంకు నిర్వాహకులను అడగ్గా గాలి పెట్టేవాళ్లు లేరు. మిషన్ పనిచేయదు. ఊరికే మిషన్ పెట్టామని చెప్పడంతో అవాక్కవడం అతడి వంతైంది'.


పెట్రోల్ బంకులో కనిపించని గాలి మిషన్, తాగునీటి సౌకర్యం

- ఇష్టారాజ్యంగా పెట్రోల్ బంకుల నిర్వహణ
- తక్కువ కొలతలు .. సౌకర్యాల లేమి
- కొరవడిన పర్యవేక్షణ
- నష్టపోతున్న వినియోగదారులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల్లోని కొన్ని పెట్రోలు బంకుల్లో నిర్వాహకులు మోసాలకు పాల్పడుతూ వినియోగదారులను నిలువునా దోచేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వారి ఆగడాలకు హద్దు లేకుండా పోతోంది. రూ.100కు పెట్రోలు, డీజిల్ పోయించుకుంటే రూ.60 పైసల నుంచి అర్ధ రూపాయి వరకు తక్కువ పోస్తున్నారు. నియోజకవర్గంలో దాదాపు 14 పెట్రోల్ బంకులున్నాయి. బంకుల్లో రోజుకు పెట్రోల్ సుమారు 95 వేల లీటర్లు, డీజిల్ సుమారు 90 వేల లీటర్లు అమ్ముడవుతోంది. లీటర్ పెట్రోలు అడిగితే 50 నుంచి వంద ఎంఎల్ వరకు తక్కువగా పోస్తున్నారు. తహసీల్దార్లు, ఆర్డీవోలు తరచూ తనిఖీలు నిర్వహించాల్సి ఉండగా పట్టనట్లు వ్యవరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కనీస సౌకర్యాలు, తక్కువ కొలతలు వంటి వాటిపై నిఘా ఊసేలేదు.

సౌకర్యాలు నిల్..

పెట్రోల్ బంకుల్లో తాగునీటి వసతి కల్పించాలి. ఆర్‌ఓ యంత్రంతోపాటు వాటర్ కనెక్షన్ ఉండాలి. కాని పెట్రోల్ బంకుల్లో తాగునీటి వసతి కనిపించడంలేదు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా అన్ని బంకుల్లో వాహన చోదకులు, ప్రజలకు మరుగుదొడ్లు, బాత్రూంలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని పలుచోట్ల ఏర్పాటు చేసినా వినియోగదారులను అనుమతించడం లేదు. కొన్ని బంకుల్లో మరుగుదొడ్లు కనిపించని పరిస్థితి నెలకొంది. ఇలాంటి సౌకర్యాలు లేకపోతే పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు. లీటర్ పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేసినందుకు మనం చెల్లించిన సొమ్ములో నాలుగు నుంచి ఎనిమిది పైసలు వరకూ మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణకు ఇస్తున్నాం.


అలంకారప్రాయంగా ఉన్న గాలి మిషన్

దిష్టిబొమ్మల్లా గాలి మిషన్లు...

వాహనాల టైర్లకు గాలి నింపడానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో ఇచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఒక వ్యక్తిని నియమించాలి. బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయకున్నా వాహనదారులు కోరితే టైర్లలో గాలి తనిఖీ చేయాలి. ఇటీవల వాహనాల టైర్లలో సాధారణ గాలికి ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు. ట్యూబ్‌లెస్ టైర్లు వస్తున్నాయి. వాటిల్లో నైట్రోజన్ నింపాలి.

కనిపించని ప్రథమ చికిత్స కిట్...

ప్రతి పెట్రోల్ బంకుల్లో ఫిర్యాదు బాక్సుతోపాటు రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారులు తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ప్రథమ చికిత్స కిట్ ప్రతి బంకు వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే అవకాశముంది. ఆ ప్రథమ చికిత్స కిట్‌లో మందులు తప్పకుండా ఉండాలి.

గాలిమిషన్లు పనిచేయడం లేదు



పెట్రోల్ బంకుల్లో గాలి మిషన్లు పనిచేయడంలేదు. పెట్రోల్ వేయించుకున్న వాహనాలకు గాలి ఉచితంగా పెట్టాల్సిన బాధ్యత పెట్రోల్ బంకు యజమానులదే. కాని గాలిమిషన్ ఉంటుంది కాని అది పనిచేయదు. పనిచేసినా గాలి పెట్టేవాళ్లు ఉండరు.

– బాటప్ప, ద్విచక్రవాహనదారుడు, ధర్మవరం

తాగునీటి సదుపాయం లేదు



పెట్రోల్ బంకుల్లో తాగునీటి సదుపాయం లేదు. కేవలం పెట్రోల్, డీజిల్ మాత్రమే వేస్తున్నారు. కొన్ని బంకుల్లో మరుగుదొడ్లకు తాళాలు వేస్తున్నారు. తాగునీటి కొళాయిలు, ట్యాంకులు ఎక్కడా ఏర్పాటు చేయలేదు.

– నారాయణ, వాహనదారుడు, ధర్మవరం

నిబంధనలు పాటించాలి

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు పాటించాలి. వాహనదారుల వాహనాల టైర్లకు ఉచితంగా గాలి నింపాలి. తాగునీటి వసతి కల్పించాలి. మరుగుదొడ్ల సదుపాయం ఉండాలి. పెట్రోల్ తక్కువగా వేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం.

– మహేష్, ఆర్డీఓ, ధర్మవరం

జర్నలిస్టులకు చేయూతనివ్వండి


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జర్నలిస్టులు

పుట్టపర్తి టౌన్: సమాజ హితం కోసం పాటుపడే జర్నలిస్టులకు చేయూతనివ్వాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రెస్‌క్లబ్ ఏర్పాటుతో పాటు జర్నలిస్టులకు పక్కాగృహాలు, పిల్లలకు ఉచిత విద్యనందించాలని కోరారు. అంతకుముందు స్థానిక షాదీమహల్‌లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, బాబు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు హరికృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామాంజనేయులు ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ ఆఫీస్ ఏర్పాటు చేయాలి


ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ధర్మవరం: లేబర్ ఆఫీస్‌ను ధర్మవరంలో ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీఓ మహేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం నాయకులు ఎస్‌హెచ్‌బాషా, మండల కోకన్వీనర్లు అయూబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ మాట్లాడుతూ గతంలో ధర్మవరం డివిజన్‌కు సంబంధించి లేబర్ ఆఫీస్ ఉండేదన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పాటు అనంతరం ఇక్కడున్న ఆఫీస్‌ను కొత్తచెరువుకు తరలించారన్నారు. ధర్మవరం ప్రాంతంలో దాదాపు 50 వేల మంది కార్మికులు ఉన్నారని, డివిజన్ కార్యాలయాన్ని ఇక్కడే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

చేనేత పరిశ్రమను పరిరక్షించాలి

ధర్మవరం: చేనేత పరిశ్రమ పరిరక్షణకు చేనేత జౌళిశాఖ మంత్రి సవిత కృషి చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ హోంలో శుక్రవారం చేనేత కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరంలో చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించి విచ్చలవిడిగా పవర్‌లూమ్స్‌లో పట్టు చీరలు తయారు చేస్తున్నారన్నారు. రిజర్వేషన్ చట్టాన్ని కాపాడాల్సిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి చేనేత కార్మికుల కష్టానికి శాపంగా మారుతుందన్నారు. చేనేత కార్మికులు గిట్టుబాటు ధరలు లేక పెరిగిన ధరలతో కుటుంబాన్ని పోషించలేక పురుగులమందు తాగి ఉరివేసుకుని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఆత్మహత్యలన్నీ జౌళిశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా వైఫల్యమే అన్నారు. ఒక్కో బిల్డింగ్‌లో 100 నుంచి 200 వరకు లూమ్స్ మగ్గాలను నడుపుతున్నారంటే సంబంధిత అధికార యంత్రాంగం పట్టించుకోలేదన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని ధర్మవరంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నేతన్న నేస్తం రూ.24 వేల నుంచి రూ.36 వేలకు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత జిల్లా అధ్యక్షుడు పూల లక్ష్మినారాయణ, గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు రమణ, ఉపాధ్యక్షులు చట్టా రవి, పట్టణ కార్యదర్శి రవికుమార్, సభ్యులు రమణ, వెంకటస్వామి, ఆదినారాయణ, హరి, దేవ, పాలగిరి శ్రీధర్, శ్రీనివాసులు, సురేష్, బాలరంగయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు

వ్యవసాయ కార్మికులు, రైతులను ఆదుకోవాలి

తాడిమర్రి: రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు, రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుళ్లాయప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం మండల కమిటీ అధ్యక్షుడిగా దాసు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణతో పాటు 11 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఏపీ చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి మాట్లాడుతూ 2005లో కమ్యూనిస్టుల మద్దతుతో ఏర్పాటైన యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించిందన్నారు. ఏఐటీయూసీ జిల్లా నేత రమణ, సీపీఐ ధర్మవరం పట్టణ కార్యదర్శి రవికుమార్, నాగభూషణం, సన్నపెద్దన్న పాల్గొన్నారు.

'రాత పూర్వకంగా హామీ ఇవ్వాలి'

కదిరి టౌన్: తమ డబ్బుకు భరోసా కల్పిస్తూ అధికారులు రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని డ్వాక్రా మహిళలు కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ముత్యాల చెరువు గ్రామైక్య సంఘం యానిమేటర్ సుబ్బారెడ్డిని తొలగించి కొత్త వ్యక్తిని నియమించారు. అయితే డ్వాక్రా సంఘాల పుస్తకాలు పాత యానిమేటర్ కొత్తవ్యక్తికి ఇవ్వలేదు. దీనిపై ఏపీఎం, సీసీ ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ మోహన్ విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా దాదాపు 100 మంది డ్వాక్రా మహిళలు శుక్రవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సీఐతో చర్చించారు. సంఘాల్లో రూ.లక్షల డబ్బుందని, కొత్తవ్యక్తి గోల్‌మాల్ చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారని అడిగారు. అధికారులు తమ డబ్బుకు బాధ్యత వహిస్తూ రాతపూర్వకంగా హామీ ఇస్తే పుస్తకాలు ఇప్పిస్తామని డ్వాక్రా మహిళలు చెప్పారు.


సీఐతో చర్చిస్తున్న మహిళలు

డిసెంబర్‌లో జిల్లా స్థాయి ప్రతిభ పరీక్ష

పుట్టపర్తి టౌన్: వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబర్‌లో జిల్లా స్థాయి ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్న సొసైటీ వ్యవస్థాపకుడు, కార్యనిర్వహకుడు అశోక్ పడపాటి తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత 13 ఏళ్ల నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేద, నిరాశ్రయ విద్యార్థుల అభ్యున్నతి కోసం విశిష్ట సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా నాలుగేళ్ల నుంచి నుంచి గ్రామీణప్రాంతాల్లోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఏటా 4500 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఆర్థిక తోడ్పాటునందిస్తున్నామని తెలిపారు. డిసెంబర్‌లో పరీక్ష నిర్వహించి జనవరిలో బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విడుదల చేసినట్లు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో డీఎస్సీ గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఉచిత హామీలు వెంటనే అమలు చేయాలి

కదిరి టౌన్: కూటమి ప్రభుత్వం ఉచిత హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలవుతున్నా హామీల అమలు ఊసే లేదన్నారు. ప్రజలకు ఉచితంగా ఇసుక ఇస్తామని ఇప్పుడు నాయకులు ఇసుకను డబ్బుకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి, పట్టణ కార్యదర్శి జీఎల్ నరసిహులు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: భవన నిర్మాణ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అంజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా హామీ అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం ఇసుక లభించక భవన నిర్మాణ కార్మికులు పక్క రాష్ట్రాలకు వలస బాట పడుతున్నారన్నారు. సీఐటీయూ నేత జె.రామక్రిష్ణ, రైతు సంఘం నేత శ్రీరాములు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.


కదిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ముదిగుబ్బ: ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం నాయకులు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఎన్నికల హామీలను అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. సీపీఎం నాయకులు ఆటో పెద్దన్న, బండల వెంకటేష్, బాబ్జాన్, పోతులయ్య, వెంకట నారాయణ, బాబా పకృద్దీన్, బాబు, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం డివిజన్‌లో మోస్తరు వర్షం


కుణుతూరు వంకలోకి చేరిన నీరు

ధర్మవరం రూరల్: ధర్మవరం డివిజన్‌లో గురువారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. దీంతో వంకలు, చెక్ డ్యాంలు, కుంటలు నీటితో కళకలలాడుతున్నాయి. పై తట్టు కురిసిన వర్షాలకు గొట్లూరు వంక నిండుగా ప్రవహిస్తోంది. ధర్మవరం మండలంలో 26.4 మి.మీ, బత్తలపల్లి 24.6, తాడిమర్రి 43.4, ముదిగుబ్బ 42.4, కనగానపల్లి 33.2, రామగిరి 20.8, చెన్నేకొత్తపల్లి 7.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ఖరీఫ్‌లో బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటను రైతులు తొలగించుకుంటున్నారు. ఇలాంటి సమయంలో కురుస్తున్న వర్షాలకు పొలాల్లో వేరుశనగ కట్టె కుళ్లిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే వర్షంతో మెట్ట భూముల్లో సాగు చేసిన వేరుశనగ, కంది పంటలకు జీవం పోసినట్లయిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణ సమతుల్యతలో జంతువుల పాత్ర కీలకం


ఫారెస్ట్ అధికారులకు కిట్లు అందజేస్తున్న రిజిస్ట్రార్ జైప్రకాష్

పుట్టపర్తి అర్బన్: పర్యావరణ సమతుల్యతలో జంతువుల పాత్ర కీలకమని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ చైర్మన్ భరత్‌లాల్ మీనా పేర్కొన్నారు. గోరంట్ల సమీపంలోని బెస్ట్ యూనివర్సిటీలో బుక్కపట్నం రేంజ్ అటవీ అధికారులతో కలిసి వన్య ప్రాణుల వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల మనుగడతో మనుషులకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. జంతుజాతుల పరిరక్షణపై విద్యార్థులు నడుం బిగించాలన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు వర్సిటీ కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చంద్రానాయక్, బీట్ ఆఫీసర్లు రామకృష్ణ, రాహుల్, వర్సిటీ డీన్ డాక్టర్ శర్మ, రిజిస్ట్రార్ జైప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, క్రియేజన్ వ్యవస్థాపకులు జనవరాజ్ గిరెన్వర్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం బెస్ట్ యూనివర్సిటీలో చైర్మన్ భరత్ లాల్ మీనాతో కలిసి స్టార్టప్ కంపెనీలు– అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు టెక్నాలజీలో తమ సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ముంబై నాబార్డు మాజీ జీఎం కుమ్మార్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం, మతం భిన్నమైనవి

పుట్టపర్తి: విజ్ఞానం, మతం భిన్నమైనవని బుక్కపట్నం, శ్రీకాకుళం జిల్లా తొగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు మగ్బూల్ హుస్సేన్, డాక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సైన్స్ అండ్ రిలీజియన్ (విజ్ఞానం-మతం)అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు శ్రీనివాసులు, ఓబులేసు, దస్తగిరి, గంగరాజు, భాస్కర్‌నాయక్, ఆనంద్, నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కటాక్షించు ధనలక్ష్మీ మాత!

ధర్మవరం అర్బన్: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రధానంగా అమ్మవార్ల ఆలయాల్లో సందడి నెలకొంది. శుక్రవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


ధర్మవరం అర్బన్: ధనలక్ష్మి అలంకరణలో సాలేవీధి పెద్దమ్మతల్లి


ధర్మవరం అర్బన్: ధనలక్ష్మిగా శివానగర్ విజయచౌడేశ్వరిదేవి


పుట్టపర్తిలో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన సత్యదేవత


బత్తలపల్లి : గాయత్రి రూపంలో లలితా త్రిపుర సుందరి


బత్తలపల్లి: గాయత్రిగా దర్శనమిస్తున్న కొల్లాపురమ్మ


ముదిగుబ్బ: మహాలక్ష్మి అలంకరణలో వాసవీమాత


కదిరి టౌన్: లక్ష్మీదేవి రూపంలో చౌడేశ్వరి మాత


అమడగూరు: గాయత్రిదేవిగా చౌడేశ్వరమ్మ


కదిరి టౌన్: కొల్హాపూర్ మహాలక్ష్మిగా వాసవీమాత


తలుపుల: ధనలక్ష్మి అలంకారంలో వాసవీమాత


ధర్మవరం అర్బన్: మహాలక్ష్మిదేవి అలంకరణలో దుర్గమ్మదేవత